ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి


అత్తాపూర్ ఇస్కాన్ శ్రీ కృష్ణ దేవాలయంలో కొలువుదీరిన రాధాకృష్ణులు


దేవాలయంలో భక్తి గీతాలను ఆలపిస్తున్న భజన బృందం

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 26 : అత్తాపూర్‌లోని ఇస్కాన్ శ్రీకృష్ణ ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. జన్మాష్టమి సందర్భంగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఇస్కాన్ దేవాలయ అధ్యక్షులు సితారాదాస్, మేనేజర్ చైతన్య అవతార్‌దాస్, ఎస్.హరిదాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు. రాధాకృష్ణుల విగ్రహాలకు అభిషేకం, మహా హారతి, పూ జలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు వేలాది సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. భజన బృందం ఆలపించిన గీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. రెండు కిలోమీటర్ల మేర భక్తుల క్యూ కనిపించింది. ఎండలో సైతం భక్తులు వేచి ఉండి స్వామి వారి కృపకు పాత్రులైయ్యారు. స్వామి వారి తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాద కార్యక్రమాల్లో భక్తులు, పూజారులు రాధాకాంత్ దాస్, కమాండర్ మధు కన్నాయ్‌దాస్, భక్తులు పాల్గొన్నారు.

రాధాకృష్ణ వేషధారణలో విద్యార్థులు

బండ్లగూడ : శ్రీకృష్ణా జన్మష్టామి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను శ్రీకృష్ణ, రాధా గోపికల వేషధారణలో ముస్తాబు చేసి మురిసిపోయారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎస్.ఎస్.వి. పాఠశాలలో శ్రీకృష్ణ జన్మష్టామి వేడుకలను నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులను శ్రీకృష్ణుడి వేషధారణలతో పాటు రాధా గోపికలుగా తయారు చేశారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ భవాని సింగ్, చైర్మన్ గోవర్ధన్‌సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలో పూజలు

ఎర్రగడ్డ : శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలో పలు ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. వివిధ పాఠశాలల్లో చిన్నారులు రాధాకృష్ణులు, గోపికల వేషధారణలతో ప్రదర్శించిన నాటికలు అలరించాయి. కన్యూమర్ రైట్స్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పీవీ రవిశేఖర్ రెడ్డి హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో జరిగిన కృష్ణాష్టమి వేడుకలకు హాజరయ్యారు. అక్కడ జరిగిన ప్రత్యేక పూజలు, అభిషేకం, ఉయ్యాల సేవా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు.

ఎస్.ఎస్.ఎస్.వి. పాఠశాలలో..

జూబ్లీహిల్స్ : యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌లోని శ్రీసాయి సరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో సోమవారం 'శ్రీకృష్ణ జన్మాష్టమి' వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల అలంకరణలతో అలరించారు. వేడుకల్లో పాఠశాల వ్యవస్థాపకులు, చైర్‌పర్సన్ శిరీషా భవానీశంకర్ పాల్గొని శ్రీకృష్టాష్టమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉట్టిని కొడుతున్న గోపిక వేషధారణలో ఉన్న చిన్నారి

ఎర్రగడ్డ : ఉయ్యాల సేవలో పాల్గొన్న రవిశేఖర్‌రెడ్డి

ఎస్.ఎస్.ఎస్.వి. పాఠశాల వేడుకల్లో చిన్నారులతో చైర్‌పర్సన్ శిరీషా భవానీశంకర్

శ్రీకృష్ణుడు, గోపికల అలంకరణలో అలరిస్తున్న చిన్నారులు

28న క్రికెట్ టోర్నమెంట్

బండ్లగూడ, ఆగస్టు 26 : జోనల్ స్థాయి ప్రీడం కప్ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను 28న పల్లవి ఇంటర్నేషనల్, చిలుకురులోని టీఎస్‌డబ్లూఆర్ ఎస్ మైదానంలో నిర్వహిస్తున్నట్లు ఎంఈవో శంకర్‌రాథోడ్ తెలిపారు. టోర్నమెంట్‌కు గండిపేట, రాజేంద్రనగర్, మొయినాబాద్, శంషాబాద్ మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు అర్హులని తెలిపారు. పాల్గొనేవారు 28న తమకు దగ్గర ఉన్న మైదానం వద్ద ఉదయం ఎనిమిది గంటలకు రిపోర్ట్ ఇవ్వాలని ఆయన కోరారు.

అనిల్ అంబానీ వ్యాపారాలపై సీబీఐ విచారణ చేయాలి

హిమాయత్‌నగర్, ఆగస్టు 26 : అనిల్ అంబానీ వ్యాపారాలపై సీబీఐచే విచారణ చేయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ సోమవారం ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూరే విధానాలను అమలు చేసిందే తప్ప ప్రజలకు మేలు జరుగలేదని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన హెచ్ఏఎల్‌కు కాకుండా అనిల్ అంబానీకి రాఫెల్ ఒప్పందం కాంట్రాక్టు ఇప్పించి మోదీ కార్పొరేట్ సంస్థల అనుకూలతను ప్రదర్శించారని మండి పడ్డారు. అంబానీ కంపెనీలపై ఐదేండ్ల పాటు సెబీలో ఎలాంటి పాత్ర లేకుండా నిషేధం విధించిందని, ఎంత మోసం జరిగితే ఆ పరిశ్రమలపై నిషేధం విధించిందో అర్థమవుతుందన్నారు. హెచ్ఏఎల్‌ను మోసం చేసి మునిగిపోతున్న అనిల్ అంబానీకి సహకారం అందించిన మోదీ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.


నూతన ఎమ్మెల్సీ అమీర్‌అలీఖాన్‌ను సన్మానిస్తున్న గాడ్స్ విజన్ అసోసియేషన్ ప్రతినిధులు

మైనార్టీల పోరాటానికి సంపూర్ణ మద్దతు

హిమాయత్‌నగర్, ఆగస్టు 26 : కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ మైనార్టీలు చేసే పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలంగాణ గాడ్స్ విజన్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నేలమల్లి సికేందర్ తెలిపారు. ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన అమీర్ అలీఖాన్‌ను సోమవారం అసోసియేషన్ నాయకులు కలిసి సన్మానించారు.

హైదర్‌గూడలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డు ఆస్తుల నిర్వహణపై ఉన్న స్వయం ప్రతిపత్తిని హరించేందుకు కేంద్రం ప్రయత్నించడం సబబు కాదన్నారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రెవరెండ్ డి.సాగర్, కార్యదర్శి రెవరెండ్ బి.ఎ. పాల్, సహాయ కార్యదర్శి రెవరెండ్ ప్రేమ్‌చంద్, రెవరెండ్ పల్లా రాజ్ కుమార్, జిల్లాల కన్వీనర్లు పాస్టర్ డి.శ్యామ్‌రావు,రెవరెండ్ వి.జోసెఫ్, పి.బెనర్జీ, రెవరెండ్ వి.సుదర్శన్, పాస్టర్ సుధామోహన్, రెవ రెండ్ బి.డేవిడ్,రెవరెండ్ కరుణాకర్, రెవరెండ్ కె.స్వామిదాస్, పాస్టర్లు సి.హెచ్.ధర్మ, శ్రీనివాస్,ఎ.థామస్,ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు

ఇందిరానగర్‌కాలనీలో రాత్రి ఉట్టి కొట్టే వేడుకల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.
- ఖైరతాబాద్

కృష్ణస్వామి జీవితం స్ఫూర్తిదాయకం

కృష్ణస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ బండ ప్రకాశ్ ముదిరాజ్

హిమాయత్‌నగర్, ఆగస్టు 26 : హైదరాబాద్ నగర తొలిమేయర్ కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ జీవితం స్ఫూర్తిదాయకమని టీ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్‌ముదిరాజ్ అన్నారు. కృష్ణస్వామి జయంతి సందర్భంగా సోమవారం హైదర్‌గూడ, ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యాలయంలో కృష్ణస్వామి చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. బండ ప్రకాశ్‌ముదిరాజ్ మాట్లాడుతూ.. నగరమేయర్, ఆంధ్రా మహాసభ నిర్వాహకుడు, రచయిత, జర్నలిస్టుగా సేవలు అందించి ప్రజల మన్నలను పొందిన గొప్పవ్యక్తి కృష్ణస్వామి అని కొనియాడారు. కార్యక్రమంలో మహాసభ అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నీలా రాములు, యువత రాష్ట్ర అధ్యక్షుడు బల్ల సత్తయ్య, ఉపాధ్యక్షులు యాదగిరి, రవికాంత్, కనకయ్య, నాయకులు బొక్కా శ్రీనివాస్ ముదిరాజ్, కృపాసాగర్, పోకల రవి, నర్సింగ్‌రావు, సాంబమూర్తి, కృష్ణమూర్తి, సురేశ్ పాల్గొన్నారు.

కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి కార్యక్రమాన్ని ఖైరతాబాద్ ముదిరాజ్ సంఘం యువత ఆధ్వర్యంలో బడా గణేశ్ వద్ద నిర్వహించారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సందీప్ ముదిరాజ్, రాకేశ్ ముదిరాజ్, రాజశేఖర్ ముదిరాజ్, ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ చైర్మన్ సింగరి రాజ్‌కుమార్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం నాయకులు తోడేటి నర్సింగ్ రావు, భిక్షపతి, ఉదయ్, శ్రీనివాస్ ముదిరాజ్ పాల్గొన్నారు.
- ఖైరతాబాద్



కృష్ణస్వామి ముదిరాజ్ సేవా సమితి రాజేంద్రనగర్ ఇన్‌చార్జిగా నర్సింగ్‌రావు

తొలి మేయర్ కొర్వి కృష్ణస్వామి సేవా సమితిలో ప్రతిఒక్కరిని భాగస్వాములను చేసేందుకు కృషి చేస్తానని రాజేంద్రనగర్ ఇన్‌చార్జి పూర్ణం నర్సింగ్ రావు పేర్కొన్నారు.సోమవారం కృష్ణా స్వామి ముదిరాజ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి ముదిరాజ్‌లు నివాళులర్పించారు. అనంతరం సేవా సమితి రాజేంద్రనగర్ ఇన్‌చార్జిగా నర్సింగ్‌రావును నియమిస్తు నియామ పత్రాన్ని సేవ సమితి అధ్యక్షుడు పిట్ల నాగేశ్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు తోడేటి సత్యం ముదిరాజ్ అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ ముదిరాజ్, అడ్వకేట్ పాండు ముదిరాజ్, మల్లేశ్ ముదిరాజ్‌లు పాల్గొన్నారు.
- బండ్లగూడ

నెలరోజుల్లో తొండుపల్లి రోడ్డు విస్తరణ పనులు పూర్తి

శంషాబాద్ రూరల్, ఆగస్టు 26 : నెలరోజుల్లో తొండుపల్లి ఫ్లై ఓవర్‌బ్రిడ్జితో పాటు విస్తరణ పనులు పూర్తి చేస్తామని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం శ తొండుపల్లి వద్ద హైదరాబాద్ – బెంగళూరు జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా తొండుపల్లి వద్ద పనులు పరిశీలించారు. రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతూ ఇటీవల స్థానిక నాయకులు కొండ పరమేశ్ గౌడ్, సుఖేందర్ సంబంధిత అధికారులతో పాటు ఎంపీకి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఎంపీతో పాటు జాతీయ రహదారి అధికారులు పనులు పరిశీలించారు. నెలరోజుల్లో పూర్తి చేస్తారని తెలిపారు. అధికారులతో మాట్లాడి రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న శ్మశానవాటిక సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. కిలోమీటర్ వరకు రోడ్డు పనులు కొనసాగుతుండడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుందన్నారు. పనులు పరిశీలించిన వారిలో మైలార్‌దేవ్‌పల్లి కార్పోరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, శంషాబాద్ మున్సిపాలిటీ నాయకులు కొండ పరమేశ్ గౌడ్, సురేందర్, శ్రీనివాస్‌యాదవ్ ఉన్నారు.

శంషాబాద్ తొండుపల్లి రోడ్డు విస్తరణ పనులు పరిశీలిస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

గుట్టలుగా చెత్తకుప్పలు.. భవన శిథిలాల వ్యర్థాలు

ఎర్రగడ్డ, ఆగస్టు 26 : బోరబండ డివిజన్ లోని సైట్ – 2 కాలనీ నుంచి సాయిబాబా నగర్ వెళ్లే మార్గం పరిస్థితి అతి దారుణంగా తయారైంది. పీలీ దర్గా ప్రధాన ద్వారం మొదలుకుని సాయిబాబా నగర్ వరకు గుట్టలను తలపించే విధంగా చెత్త, భవన శిథిలాల వ్యర్థాలు దర్శనమిస్తాయి. తీవ్ర దుర్గంధంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చెత్తకారణంగా దోమలు పెరుగడంతో పరిసర బస్తీల వాసులు ఇబ్బందులు పడుతున్నారు. బల్దియా యూసుఫ్‌గూడ సర్కిల్ పరిధిలోని ఈ ప్రాంతాన్ని పారిశుధ్య విభాగం అధికారులు పట్టించుకోవటంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చెత్తను తొలగించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలి

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 26: గణేశ్ నవరాత్రులను ప్రజలు ప్రశాంతదంగా జరుపుకోవాలని మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ పి.నరేందర్ తెలిపారు. సోమవారం సాయంత్రం ప్రగతి భవన్‌లో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. భక్తి గీతాలను మాత్రమే పెట్టాలని, రాత్రి సమయాల్లో విగ్రహాల వద్ద ఇద్దరు భక్తులు ఉండేలా చూసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసుకోవాలని సూచించారు. ఎంట్రీ చేసుకున్న మండపాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ నరేందర్

బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 26: ఓయూ పరిధిలోని బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ మూడో సెమిస్టర్ రెగ్యూలర్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడువారాల తర్వాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి, సెప్టెంబర్ 3లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుంతో 4వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 10 లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www. osmania. ac.inలో చూసుకోవచ్చన్నారు.

ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ పరీక్ష తేదీల ఖరారు

ఓయూ పరిధిలోని ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలను సెప్టెంబర్ 4వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

సాయుధ పోరాట యోధుల చరిత్ర బుక్‌లెట్ అందజేత

హిమాయత్‌నగర్ : తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా సీపీఐ నగర సమితి ముద్రించిన సాయుధ పోరాట యోధుల చరిత్ర బుక్‌లెట్‌ను సోమవారం సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డికి ఆయన నివాసంలో సీపీఐ నగర నాయకులు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈటీ నరసింహ, నగర కార్యదర్శి ఎస్.ఛాయదేవి, సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి.స్టాలిన్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఖైరతాబాద్, ఆగస్టు 26 : గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సైఫాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలుగుతల్లి ఫ్లై ఓవర్ కింద ఓ వ్యక్తి విగతజీవిగా పడి ఉన్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా, మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానలోని మార్చూరీకి తరలించారు. వయసు 50–60 ఏండ్ల మధ్య ఉండవచ్చనని, నలుపురంగు దుస్తులు ధరించి ఉన్నాడని, యాచకుడై ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

ఎస్సీ, ఎస్టీ అసైన్డ్ భూములకు హక్కు కల్పించాలి

చిక్కడపల్లి, ఆగస్టు 26: కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రకారం ఎస్సీ, ఎస్టీ అసైన్డ్ భూములు తిరిగి ఇచ్చి అన్ని హక్కులను పునరుద్ధరణ చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు.తెలంగాణ భూరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అసైండ్ భూముల యాజమాన్య హక్కుల సాధన కోసం రౌండ్ టేబుల్ సమావేశంను నిర్వహించారు. సమితి నాయకుడు మైసయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ జన సమితి నగర అధ్యక్షుడు నర్సయ్య, ప్రొఫెసర్ పురుషోత్తం రాపోలు రాములు, తదితరు హాజరయ్యరు ఈ సందర్భంగా జన సమితి నగర అధ్యక్షుడు నర్సయ్య మాట్లాడుతూ దళిత, గిరిజనలకు దూరం అవుతున్న భూమి హక్కు కోసం పోరాటం చేయాలన్నారు. ఈ సమావేశంలో డీబీఎస్‌యూ నాయకుడు నర్సింహ, శివలింగం, ఇటికల లలిత, బీఎన్ రమేశ్ కుమార్, బండారు అశోక్ వర్ధన్, సారయ్య పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులపై ఒత్తిడి తేవాలి

కాచిగూడ,ఆగస్టు 26: కేంద్రం బీసీల సమస్యల పరిష్కారానికి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ ప్రధాని మోదీపై ఒత్తిడి తేవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడలో విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్రం చేపట్టే జన గణనలో కులగణన చేసి, అసెంబ్లీలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. జనగణలో కులగణన చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో త్వరలో లక్షలాది మందితో దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు పాల్గొన్నారు.